# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఖమ్మం - వరంగల్ - నల్గొండ

సోమవారం, 17 ఆగస్టు 2026




ఎలాంటి ప్రాణహాని జరిగినా

## ఎమ్మెల్యే కూనంనేనిదే బాధ్యత

- ఎమ్మెల్యే బెదిరింపు ధోరణి సరికాదు...!?
- దళితుల సమాధుల మీద సౌదాన్ని నిర్మించుకున్న కూనంనేని
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

6




# బెట్టింగ్ ఉచ్చులో యువత

### చిన్న మొత్తాలతో మొదలు.. పెద్ద నష్టాలతో ముగింపు

- మధ్యతరగతి కుటుంబాలపై భారం
- అవగాహనతోనే అడ్డుకట్ట
- ఈజీ మనీ మోజులో యువత ఆగం కావొద్దు
- తల్లాడ మండల కేంద్రంలో ప్రత్యేక అవగాహన క్యాంపు ఏర్పాటు చేయాలి
- కళాశాలలు, యువజన సంఘాల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- అక్రమ బెట్టింగ్‌లపై నిఘా.. నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ.. ఒక్కసారి డబ్బు వస్తే చాలు అన్న ఆలోచన.. చివరకు అదే యువతను బెట్టింగ్ ఉచ్చులోకి నెడుతోంది. మొబైల్ ఫోన్‌లోనే అందుబాటులోకి వస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జూద తరహా ఆటలకు ఆకర్షితులవుతున్న కొంతమంది యువత మొదట సరదాగా ప్రారంభించి, ఆ తర్వాత పెద్ద మొత్తాల్లో డబ్బులు కోల్పోయే పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నష్టాలను పూడ్చుకోవాలనే ఆలోచనతో మళ్లీ మళ్లీ బెట్టింగ్‌లు పెట్టడం ద్వారా అప్పుల ఊబిలో చిక్కుకునే ప్రమాదం పెరుగుతోంది.



తల్లాడ, ఆగస్టు 16 (నినాదం):

2



## అంగట్లో సరుకుల్లా అంగన్వాడీ పోస్టులు

టీచరుకు రూ 2 నుండి రూ 3 లక్షలు, ఆయాకు లక్ష డిమాండ్..

- దరఖాస్తుదారులతో ప్రజా ప్రతినిధుల భేరసారాలు..
- ఎంపికల్లో నిబంధనలకు నీళ్లు...?

అంగట్లో సరుకుల్ల అంగన్వాడీ టీచర్,ఆయా పోస్టులు మారాయని దరఖాస్తు దారులు వాపోతున్నారు. ఎంపికలు పారదర్శకంగా నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తామంటూ ఎంపికలను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తారని అని చెప్పున్నప్పటికీ స్థానికంగా నా అధికారులు మాత్రం నిబంధనలకు నీళ్లు వదిలి స్థానిక ప్రజాప్రతినిలో ఒత్తిడికి తలలోగ్గి ఎంపికలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో మొత్తం 80 పోస్టులు ఖాళీగా ఉండగా ఇల్లందు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 5 టీచర్ పోస్టులు ఖాళీగా వున్నాయి. ఈ పోస్టులకు ఆయా ప్రాంతాలకు కేటాయించి కులాల వారీగా ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేశారు.ఈ నిబంధనలను పాటించకుండా ప్రాథమిక ఎంపిక లిస్టులో ఇతర కులాలకు చెందిన వారి పేర్లను అర్హులుగా గుర్తించినట్లు సమాచారం.

- ఇల్లందు,ఆగస్టు16, (నినాదం ):

వార్త మెయిన్‌లో..



మానవ హక్కుల పరిరక్షణ

## అందరి సామాజిక బాధ్యత

- డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్
- రోగులకు బాధ్యతాయుతమైన, గౌరవప్రదమైన వైద్య సేవలే పరమావధి
- కొత్తగూడెంలో హ్యూమన్ రైట్స్ ఫాండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అవగాహన సదస్సు

4

# బెట్టింగ్ ఉచ్చులో యువత..

- మధ్యతరగతి కుటుంబాలపై భారం
- అవగాహనతోనే అడ్డుకట్ట
- ఈజీ మనీ మోజులో యువత ఆగం కావొద్దు
- తల్లాడ మండల కేంద్రంలో ప్రత్యేక అవగాహన క్యాంపు ఏర్పాటు చేయాలి
- కళాశాలలు, యువజన సంఘాల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- అక్రమ బెట్టింగ్‌లపై నిఘా.. నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

తల్లాడ, ఆగస్టు 16 (నినాదం):

**సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ.. ఒక్కసారి డబ్బు వస్తే చాలు అన్న ఆలోచన.. చివరకు అదే యువతను బెట్టింగ్ ఉచ్చులోకి నెడుతోంది. మొబైల్ ఫోన్‌లోనే అందుబాటులోకి వస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జూద తరహా ఆటలకు ఆకర్షితులవుతున్న కొంతమంది యువత మొదట సరదాగా ప్రారంభించి, ఆ తర్వాత పెద్ద మొత్తాల్లో డబ్బులు కోల్పోయే పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నష్టాలను పూడ్చుకోవాలనే ఆలోచనతో మళ్లీ మళ్లీ బెట్టింగ్‌లు పెట్టడం ద్వారా అప్పుల ఊబిలో చిక్కుకునే ప్రమాదం పెరుగుతోంది.**




**చిన్న మొత్తాలతో మొదలు.. పెద్ద నష్టాలతో ముగింపు**

బెట్టింగ్ వైపు ఆకర్షితులయ్యే వారిలో చాలామంది మొదట చిన్న మొత్తాలతోనే ప్రారంభిస్తున్నట్లు తెలుస్తోంది. గెలిచినప్పుడు మరింత డబ్బు సంపాదించవచ్చనే నమ్మకం ఏర్పడటంతో మొత్తాలను పెంచుతూ పోతారు. ఒక దశలో నష్టాలు మొదలైన తర్వాత పోయిన డబ్బును తిరిగి సంపాదించాలనే ఉద్దేశంతో మరింత డబ్బు పెట్టే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో అప్పులు చేయడం, కుటుంబ సభ్యులకు తెలియకుండా డబ్బులు తీసుకోవడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

**మధ్యతరగతి కుటుంబాలపై భారం**

యువత బెట్టింగ్‌లకు బానిసైతే దాని ప్రభావం ఒక్క వ్యక్తికే పరిమితం కాదు. కుటుంబ ఆర్థిక పరిస్థితిపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. అప్పులు పెరగడం, ఇంట్లో గొడవలు, చదువు లేదా ఉద్యోగంపై దృష్టి తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు ఇలాంటి ఆర్థిక నష్టాలను భరించలేక ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ముందస్తు అవగాహన అవసరం.

**మండల కేంద్రంలో ప్రత్యేక క్యాంపు పెట్టాలి**

తల్లాడ మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. బెట్టింగ్ వల్ల కలిగే ఆర్థిక నష్టాలు, కుటుంబ సమస్యలు, చదువు--ఉద్యోగాలపై ప్రభావం, చట్టపరమైన పరిణామాలను యువతకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించాలని సూచిస్తున్నారు. కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, యువజన సంఘాలు, క్రీడా మైదానాలు, విద్యార్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

**పోలీసుల పాత్ర కీలకం**

బెట్టింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ప్రచారాలు, అక్రమ బెట్టింగ్ నిర్వహణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. యువతను ఆకర్షించే విధంగా ప్రచారం చేస్తున్న అక్రమ బెట్టింగ్ నిర్వాహకులపై నిఘా పెట్టడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదే సమయంలో యువతను కేవలం భయపెట్టడం కాకుండా బెట్టింగ్ వల్ల కలిగే నష్టాలను ఉదాహరణలతో వివరించి, సమస్యలో చిక్కుకున్న వారికి సరైన మార్గనిర్దేశం చేయడం కూడా పోలీసుల అవగాహన కార్యక్రమాల్లో భాగం కావాలని పలువురు సూచిస్తున్నారు.

**తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా గమనించాలి**

యువత చేతిలో మొబైల్ ఫోన్ ఉండటం సాధారణమే అయినప్పటికీ.. వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు, తెలియని వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు ఎందుకు చేస్తున్నారు, అకస్మాత్తుగా డబ్బు అవసరం ఎందుకు వస్తోంది అనే విషయాలను తల్లిదండ్రులు గమనించాలి. అనుమానం వచ్చిన వెంటనే మందలించడం కంటే పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి అసలు సమస్యను తెలుసుకోవడం మంచిది.

**నష్టపోయిన వారిని నిందించొద్దు**

బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకున్న తర్వాత విషయం కుటుంబ సభ్యులకు తెలుస్తుందనే భయంతో కొందరు తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో వారిని అవమానించడం, నిందించడం కాకుండా సమస్యను అర్థం చేసుకుని బయటపడేందుకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలి. డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు.. కానీ ప్రాణం పోతే తిరిగి రాదు అనే విషయాన్ని యువతకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు స్పష్టంగా తెలియజేయాలి. తీవ్ర నిరాశ లేదా ఆత్మహత్య ఆలోచనలు కలిగిన వ్యక్తిని ఒంటరిగా వదిలేయకుండా వెంటనే కుటుంబ సభ్యులు, నమ్మకమైన వ్యక్తులు లేదా నిపుణుల సహాయం తీసుకునేలా చూడాలి.

**యువతకు అవగాహనే రక్షణ**

ఈజీ మనీ.పేరుతో మొదలయ్యే బెట్టింగ్ చివరకు ఈజీ మనీ కాదు.. ఈజీగా బయటపడలేని ఆర్థిక, సామాజిక సమస్యగా మారవచ్చని స్థానికులు హెచ్చరిస్తున్నారు. తల్లాడలో పోలీసు శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, యువజన సంఘాలు కలిసి నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే యువతను బెట్టింగ్ బారిన పడకుండా కాపాడే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.



# నిరుద్యోగ సమస్యపై ఆగస్టు 20న మహాధర్నా

- ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి
- ఆగస్టు 20న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా
- యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలి: సీపీఎం పిలుపు




తల్లాడ, ఆగస్టు 16 (నినాదం)

ంనిరుద్యోగ సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఆగస్టు 20న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని యువతకు పిలుపునిచ్చారు.

తల్లాడలోని దొడ్డ కృష్ణయ్య భవన్‌లో సీపీఎం తల్లాడ మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శి షేక్ మస్తాన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మాదినేని రమేష్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్నా దేశానికి వెన్నెముకగా నిలిచే యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందడం లేదన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి, ఏళ్ల తరబడి చదువుతున్న నిరుద్యోగ యువత భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుంటున్నారని, వారి ఆశలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

**ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలి**

సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఇన్నేళ్లు గడిచినా ఆ హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రంలోని విద్య, వైద్య తదితర ప్రభుత్వ శాఖల్లో పెద్ద సంఖ్యలో ఖాళీ పోస్టులు ఉన్నాయని, వాటిని కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, ఉద్యోగాలు లభించేంత వరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.5,000 నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లోని బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా తక్షణమే భర్తీ చేయాలని కోరారు.

**మహాధర్నాకు యువత తరలిరావాలి**

యువజన, ఉద్యోగ, ఉపాధి సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 20న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, కళ్యాణ కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, శీలం పకీరమ్మ, మన్నేపల్లి రామారావు, సత్తెనపల్లి నరేష్, రాజబోయిన సైదులు, కట్ట దర్గయ్య, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.






## అశ్వారావుపేటను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుదాం

**ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**

అశ్వరావుపేట, ఆగస్టు 16 (నినాదం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని భక్తిశ్రద్ధలతో ఆలపించారు. ఈ వేడుకల్లో నియోజకవర్గంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సాధించిన ప్రగతిపై ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి సందేశాన్ని అందించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టంగా చేపడుతున్న స్మార్ట్ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ములకలపల్లి మండలం తాళ్లపాయ గ్రామ పంచాయతీ నుండి అందుకుంటున్న ,కొండ్రు అనిల్ కుమార్ లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో తాళ్లపాయ గ్రామపంచాయతీ లబ్ధిదారులు పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ,స్వాతి బిందు మండలాల అధికారులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, జగన్నాథపురం సర్పంచ్,కుంజా వినోద్ అశ్వరావుపేట నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ,సురభి రాజేష్ గుంటూరు సాయి, తాళ్లపాయ గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోండ్రు రాజు కుమార్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా వైద్య సేవలు

- ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి
- 133వ నెల ఉచిత వైద్య శిబిరం విజయవంతం




**వైరా, ఆగస్టు 16 (నినాదం ):**
ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా వైద్య సేవలు అందిస్తున్నామని ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రతి నెల మూడవ ఆదివారం వైరా బోడేపూడి భవనంలో నిర్వహిస్తున్న బోడేపూడి ఉచిత వైద్య శిబిరం 133వ నెల విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను పరిశీలించారు. ముఖ్యంగా బీపీ, షుగర్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను కేవలం రూ.100కే నెలకు సరిపడా పంపిణీ చేశారు. సాధారణ ప్రజలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో తక్కువ ఖర్చుతో మందులు అందించడం ద్వారా బోడేపూడి వైద్య శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోంది. ఈ శిబిరంలో డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు ఉచితంగా వైద్య సేవలు అందించారు. రోగులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా అవసరమైన సూచనలు, మందులను అందించారు. భావనా డయాగ్నస్టిక్స్ బాధ్యులు ఉచితంగా షుగర్ పరీక్షలు చేశారు. ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ 133 నెలలుగా నిరంతర వైద్య సేవలను కొనసాగించడం ద్వారా సీపీఐ(ఎం) ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలకు దూరమయ్యే పేద ప్రజలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగపడు తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రతి నెల మూడవ ఆదివారం వైరా బోడేపూడి భవనంలో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నామని. పేదలకు అందుబాటులో వైద్య పరీక్షలు, మందులు అందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని,. భవిష్యత్తులోనూ ఈ సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. 133వ నెల వైద్య శిబిరాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్యులు, నిర్వాహకులు, కార్యకర్తలకు ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్ రావు, బొంతు సమత, మాదినేని రజినీ, కంసాని మల్లికాంబ, మల్లెంపాటి ప్రసాదరావు, మోదుగు నాగరాణి, కంభంపాటి సత్యనారాయణ, పూనాటి సూరయ్య, ఎన్.రంగారావు, ఆలూరి శ్రీనివాసరెడ్డి, హరి వెంకటేశ్వరరావు, మందడపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ కార్మికుడు జైత్రామ్ మృతి బాధాకరం

- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం
- వారసత్వ ఉద్యోగం, పరిహారం, బెనిఫిట్స్ త్వరగా అందేలా చూడాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం, ఆగస్టు 16 (నినాదం):**
విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ మున్సిపల్ కార్మికుడు భూక్యా జైత్రామ్ మృతి చెందడం బాధాకరమని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంగపేట 23వ డివిజన్‌కు చెందిన మల్టీ పర్పస్ కార్మికుడు జైత్రామ్ విద్యుత్ దీపాలు అమర్చుతూ స్తంభంపై నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలైన సంగతి తెలిసిందే. ఖమ్మంలోని మమత జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారని తెలియడంతో ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుజాత, మేయర్ మూడ్ గణేష్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మరణించిన కార్మికుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలని, ప్రభుత్వం, మున్సిపల్ శాఖ ద్వారా తక్షణ ఆర్థిక పరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి ఉద్యోగం కల్పించేలా వేగవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కార్మికుడికి రావాల్సిన అన్ని రకాల టెర్మినల్ బెనిఫిట్స్ ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన కుటుంబ సభ్యులకు అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. బాధితుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**జైత్రామ్ కుటుంబానికి అండగా ఉంటాం : సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

కార్పొరేషన్ కార్మికుడు భూక్యా జైత్రామ్ మృతి చెందడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. విధి నిర్వహణలో గాయలపాలెం చికిత్స పొందుతున్న జైత్రామ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ ఆదివారం ఖమ్మం మమత ఆసుపత్రికి చేరుకుని జైత్రామ్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్మికుడి అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. నివాళు లు అర్పించిన వారిలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గెద్దాడు నగేష్, కారొ ప్రేటర్లు బోయిన విజయ్ కుమార్, బండి నరసిం హ, ధనరాజ్, దినేష్ తదితరులు తదితరులు ఉన్నారు.



# సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్రకు ఘన సన్మానం

**కల్లూరు, ఆగస్టు 16 (నినాదం)**
బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యను కల్లూరు మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు సండ్రను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. బొకేలు, స్వీట్లు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సండ్ర వెంకట వీరయ్య తిరుమల దైవదర్శనానికి వెళ్లి తిరిగి వచ్చిన నేపథ్యంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి వరుసగా మూడు పర్యాయాలు ప్రజల మద్దతుతో గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా సండ్ర ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధినే ధ్యేయంగా, ప్రజాసేవే శ్వాసగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన నాయకుడిగా కొనియాడారు. సండ్ర వెంకట వీరయ్య ఆయురారోగ్యాలతో మరింత కాలం ప్రజాసేవలో కొనసాగుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇటీవల కొందరు నాయకులు సండ్రపై ఈర్ష్య, ద్వేషాలతో తప్పుడు ప్రచారం చేస్తూ చౌకబారు వ్యాఖ్యలు చేయడం వారి కుసంస్కారానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కల్లూరు మండల అధ్యక్షుడు పాలేపు రామారావు, మాజీ సొసైటీ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మేకల కృష్ణ,



మైనార్టీ నాయకులు సయ్యద్ రవూఫ్, కల్లూరు మున్సిపల్ కౌన్సిలర్లు ఇస్మాయిల్, కనపర్తి శ్యామల రాజ్‌కుమార్, సయ్యద్ రేష్మ ఇంతియాజ్, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ కమ్లీ, బీఆర్ఎస్ మండల నాయకులు కొరకొప్పు ప్రసాద్, కట్టా అర్లప్ప, పాలడుగు శంకర్‌రావు, బొల్లం వెంకటేశ్వర్లు, జర్పుల రాములు, జాకీర్ నవాబ్, శిరసాని రాజు, సన్నీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారి జాశ్వికను ఆశీర్వాదించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్

**వేంసూరు, ఆగస్టు 16 (నినాదం)**
వేంసూరు మండలం కుంచపర్తి గ్రామంలోని మారెమ్మ తల్లి ఆలయంలో కిన్నెర శ్రీనివాసరావు-శిరీష దంపతుల కుమార్తె జాశ్విక అన్నప్రాసన వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై చిన్నారి జాశ్వికను ఆశీర్వదించారు. అనంతరం శ్రీ మారెమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎదగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## బొంతు వెంకటేశ్వరరావుకు చిత్ర పటానికి డాక్టర్ మట్టా దయానంద్ నివాళులు

**వేంసూరు, ఆగస్టు 16 (నినాదం)**
వేంసూరు మండలం జయలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బొంతు గిరి తండ్రి బొంతు వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆదివారం జయలక్ష్మీపురం గ్రామానికి వెళ్లి వెంకటే శ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వెంకటేశ్వర రావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధై ర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ గడిపర్తి శ్రీను, కాంతారెడ్డి, కరుణాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రెండు పంచాయతీల బాధ్యతలతో.. ఉత్తమ కార్యదర్శిగా ప్రశాంత్

**నల్లబెల్లి ఆగస్టు 16 (నినాదం):**
రెండు గ్రామ పంచాయతీల బాధ్యతలనుసమర్థవంతంగా నిర్వహిస్తూ ఉత్తమ సేవలందించిన నూతనకంటి ప్రశాంత్‌కు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించింది. నల్లబెల్లి మండలం లెంకలపెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనను ఉత్తమ జిల్లా పంచాయతీ కార్యదర్శిగా ఎంపిక చేసి ప్రశంసా పత్రం అందజేశారు. ఆగస్టు 15న వరంగల్‌లోని కుష్ మహల్ ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రశాంత్ ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. ప్రస్తుతం లెంకలపెల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనంగా నల్లబెల్లి గ్రామ పంచాయతీ బాధ్యతలను కూడా అప్పగించారు. రెండు పంచాయతీల పరిపాలనను సమన్వయంతో నిర్వహిస్తూ అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు.పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి: గ్రామాల్లో స్వచ్ఛతనుమెరుగుపరచడం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవం తంగా అమలు చేయడం, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవడం, పంచాయతీ నిధుల వినియో గం, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పాటించడం వంటి అంశాల్లో ప్రశాంత్ చూపిన అంకితభావాన్ని అధికారులు గుర్తించారు. అదనపు బాధ్యతలు ఉన్నప్పటికీ గ్రామాల అభివృద్ధి పనులను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడంపై ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ప్రశాంత్ సేవలను అభినందించారు. జిల్లా కలెక్టర్ సత్యశారద, డీపీవో కల్పన, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో రవి తదితరులు ఆయనను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలి పారు. జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల లెంకలపెల్లి, నల్లబెల్లి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# మానవ హక్కుల పరిరక్షణ
# అందరి సామాజిక బాధ్యత

- డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్
- రోగులకు బాధ్యతాయుతమైన, గౌరవప్రదమైన వైద్య సేవలే పరమావధి
- కొత్తగూడెంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అవగాహన సదస్సు



**కొత్తగూడెం, ఆగస్టు 16(నినాదం):** సమాజంలో ప్రతి పౌరుడికి సమానమైన హక్కులు కల్పించడంతో పాటు గౌరవప్రదమైన సేవలు అందించడం అందరి ప్రాథమిక బాధ్యత అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ



అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ తుకారాం రాథోడ్ ఉద్ఘాటించారు. ఆదివారం స్థానిక హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కార్యాలయంలో ప్రజారోగ్యం, పౌర హక్కుల పరిరక్షణపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి సామాజిక, ప్రజారోగ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**వైద్య రంగంలో రోగుల గోప్యత, భద్రతకే ప్రథమ పీఠం**

వైద్య పరిపాలనలో మానవ హక్కుల పాత్ర అత్యంత కీలకమైనదని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. ప్రతి బాధితుడికి సరైన ప్రదేశంలో, సరిపడా మోతాదులో, సరైన మందులు అందిస్తూనే వారి వ్యక్తిగత వివరాల గోప్యతను కాపాడటం హక్కుల పరిరక్షణ కిందకే వస్తుందన్నారు. రోగుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ సురక్షితమైన వైద్య విధానాలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**అధికారులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయం విధిగా మారాలి**

హక్కుల ఉల్లంఘనలను నివారించి, పౌరులకు సకాలంలో న్యాయం అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీఓలు) సమన్వయంతో పనిచేయాలని సదస్సు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఆర్టీఓ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట పుల్లయ్య, డాక్టర్ ప్రతాప్, డిప్యూటీ డీఎంహెచ్ఓ తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బొడ్డిపాటి దాసు, సుధాకర్ కల్వ, రాందాస్ నాయక్, లక్ష్మణ్, రుక్మిణి తదితర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

# నిరుద్యోగ యువత జీవితాలతో
# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం

- ఖాళీల భర్తీ ఉద్యోగ హక్కుల కోసం యువత సంఘటితం కావాలి
- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కే. ఫహీం
- ఘనంగా ఏఐవైఎఫ్ ములకలపల్లి మండల 10వ మహాసభ



**ములకలపల్లి, ఆగస్టు 16(నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్ ) ములకలపల్లి మండల 10వ మహాసభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏ ఐ వై ఏఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కే. ఫహీం జెండా ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. అనంతరం జరిగిన మండల మహాసభకు ఏ ఐ వై ఏఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏ ఐ వై ఏఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె యుసప్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా యువతకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కల్పించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'యంగ్ ఇండియా' పేరుతో దేశ యువతను మభ్యపెడుతోందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నప్పటికీ యువతకు తగిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారునీట్వం టి పోటీ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకేజీలతో విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పోటీ పరీక్షల్లో పారదర్శకతను పెంచి, యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏ ఐ వై ఏఫ్ ములకలపల్లి మండల నూతన కౌన్సిల్‌ను 22 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. అనంతరం నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులను కూడా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. నూతన కమిటీ యువత సమస్యలపై నిరంతరం పోరాడుతూ, విద్య, ఉపాధి, సామాజిక భద్రత కోసం మండలవ్యాప్తంగా ఉద్యమాలను బలోపేతం చేయాలని మహాసభ నిర్ణయించింది. అదేవిధంగా రాబోయే సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో జరగనున్న ఏ ఐ వై ఏఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏ ఐ వై ఏఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కే. ఫహీం పిలుపునిచ్చారు. ఈమహాసభలో ఏ ఐ వై ఏఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కే. కయ్యూమ్, ఏ ఐ వై ఏఫ్ జిల్లా నాయకులు జావీద్, రవి, సీపీఐ మండల కార్యదర్శి ఎం.డి. యూసుఫ్, ఏ ఐ వై ఏఫ్ మండల నాయకులు తాంద్ర సమ్మయ్య, భూక్యా వెంకటేష్, ప్రసాద్, రవీందర్, వజ్జ ప్రసాద్, కంటే మారేష్ తదితరులు పాల్గొన్నారు.






## పెద్ది కుటుంబాన్ని పరామర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

**నల్లబెల్లి, ఆగస్టు 16 (నినాదం):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుసేన్ నాయక్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా హుసేన్ నాయక్ మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేసిన నాయకుడని అన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. పెద్ది మృతి నర్సంపేట ప్రాంత ప్రజలకు, ఆయన అభిమానులకు, రాజకీయ వర్గాలకు తీరని లోటని అన్నారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి అండగా ఉంటామని హుసేన్ నాయక్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్‌గౌడ్, నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని పెద్ది కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



## అటల్‌జీ ఆశయ సాధనే నిజమైన నివాళి

**నల్లబెల్లి, ఆగస్టు 16 (నినాదం):** మాజీ ప్రధానమంత్రి, బీజేపీ మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా నల్లబెల్లి మండల బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నల్లబెల్లి మండలఅధ్యక్షుడు తడుక వినయ్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశసేవ, ప్రజాసేవ, విలువలతో కూడిన రాజకీయాలకు అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం ఆదర్శమని అన్నారు. దేశం పట్ల ఆయనకున్నఅచంచలమైన దేశభక్తి, ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత, రాజకీయాల్లో పాటించిన విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వాజ్‌పేయి ఆలోచనలు, ఆశయాలు, దేశభక్తి భావనలు దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసు కెళ్లడం, ప్రజాసేవకు అంకితమై పనిచేయడమే అటల్‌జీకి అందించే నిజమైన నివాళి అని తడుక వినయ్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ జిల్లా నాయకుడు తడుక అశోక్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, ఉపాధ్యక్షులు బత్తిని కుమారస్వామి, సింగిరెడ్డి యాదగిరి, గుర్రపు నరేష్, మండల నాయకులు వల్లే పర్వతాలు, కక్కెర్ల సురేష్, ములుక రాజేష్, మురికి మనోహర్, ధర్మారం క్రాంతికుమార్, జన్ను మధు, బానోతు వీరన్న, సుమన్, బంగారి, గణేష్ తదితరులు పాల్గొని వాజ్‌పేయికి ఘన నివాళులు అర్పించారు.

## తల్లాడలో నేటి నుంచి ప్రజావాణి..

### మండల కేంద్రంలోనే అధికారులతో సమస్యలు పరిష్కారం

**తల్లాడ, ఆగస్టు 16 (నినాదం)** ప్రజలు తమ సమస్యలు, వినతులు, దరఖాస్తుల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా నేటి నుంచి ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తల్లాడ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం జరగనుంది. తల్లాడ మండలంలోని ప్రజలు తమకు సంబంధించిన రెవెన్యూ, పంచాయతీ, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, భూములు, రేషన్, విద్య, వైద్యం తదితర సమస్యలపై దరఖాస్తులు, వినతులను మండల కేంద్రంలోని ప్రజావాణిలో సంబంధిత అధికారులకు అందజేయవచ్చు. ఇప్పటి వరకు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లాల్సి వచ్చిన ప్రజలకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. మండల స్థాయిలోనే ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. తల్లాడ మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు.

# వైరా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలి

- అఖిలపక్షం డిమాండ్
- సాగునీటి విడుదలపై ప్రభుత్వ అధికారులు స్పష్టతనివ్వాలి
- సాగునీరు అందించకపోతే రైతులతో విస్తృత స్థాయి ఉద్యమం



**వైరా, ఆగస్టు 16( నినాదం):**

వైరా ఆయకట్టు పరిధిలోని రైతులకు వరి సాగుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మిట్టపల్లి గార్డెన్స్ లో సిపిఎం మండల కన్వీనర్ సుంకర సుధాకర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావ్, బాణాల వెంకటేశ్వర్లు, సిపిఎం డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో సుమారు 17వేల500 హెక్టార్ల పరిధిలో వరి సాగు కొనసాగుతుందని ఈ ప్రాంత రైతులకు వరి సాగు ప్రధాన జీవనాధారం పేర్కొన్నారు. వైరా రిజర్వాయర్ ప్రస్తుత నీటిమట్టం 17.5 అడుగులు ఉండగా ప్రభుత్వ అధికారులు వరి సాగుకు నీరు అందించలేమని చెప్పడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వైరా మండల పరిధిలో రైతులు ఇప్పటికే వరి సాగుకు సన్నద్ధమయ్యారని పలుచోట్ల నాట్లు, విత్తన జల్లుడు పనులను నిర్వహిస్తున్నారని, ఇప్పుడు సాగునీరు అందించడం లేదని చావు కబురు చల్లగా చెప్పటం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సాగునీరు అందించడానికి వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ కృషి చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులు సాగునిరిస్తామని హామీ ఇవ్వడం,తీరా నాట్లు వేశాక, విత్తనాలు చల్లాక స్థానిక అధికారులు తమ పై అధికారుల సూచనలు పాటిస్తున్నామని, సాగునీరు ఇవ్వకుండా అడ్డుపడటం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. సీతారామ ప్రాజెక్టు, సీతమ్మధార ప్రాజెక్టు ద్వారా వైరా రిజర్వాయర్ కు తరలించాల్సిన గోదావరి జిల్లాలను జూలూరుపాడు మండలం వినోబా నగర్ నుండి సత్తుపల్లి లంకా సాగర్ కు, ఇతర చెరువులకు సాగు జలాలను తీసుకువెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వైరా ఆయకట్టు పరిధిలోని రైతుల కడుపు కొట్టి తమ ప్రాంతాలకు సాగునీటిని తీసుకువెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రైతులకు వరి సాగుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సోమవారం స్థానిక నీటి పారుదల శాఖ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎం --ఎల్ ) మాస్ లైన్ వైరా డివిజన్ కార్యదర్శి లాల్ మియా, తోట నాగేశ్వరరావు,మద్దెల రవి, హరి వెంకటేశ్వరావు, మల్లెంపాటి రామారావు, కొంగర సుధాకర్, కామినేని రవి,బట్ట భద్రయ్య,మరికంటి శివ, ఏదినూరి శ్రీను, షేక్ సైదా, చింతయ్య,మాడపాటి వెంకటి, షేక్ నాగులు పాషా, మీరా, కొత్తా వెంకటేశ్వరరావు, బెజవాడ వీరభద్రం,అప్పంసురేష్, చింతమాల బుజ్జి, బాణాల వెంకటేశ్వరరావు,తిరుపతి శ్రీను, ఓర్చు రవి, వల్లపు రాంబాబు, వేముల శివకృష్ణ, తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

# ఇంటికో రక్త దాతాలను తయారు చేయడంమే లక్ష్యం

- రక్తం తీసుకోవడమే కాదు.. తిరిగి ఇవ్వాలి
- క్లబ్ గౌరవ అధ్యక్షుడు సంగం వెంకట పుల్లయ్య, లగడపాటి రమేశ్ చంద్
- యంగ్ ఇండియన్ బ్లడ్ డోనార్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం



**కొత్తగూడెం, ఆగస్టు 16(నినాదం):**

కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిం చారు. క్లబ్ జాతీయ అధ్యక్షుడు జెబి బాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. వక్తలు మాట్లాడుతూ.. ఎందరో రోడ్డు ప్రమాదాలకు గురవుతూ.. మరికొందరు ఆరోగ్య పరంగా రక్తదా నం చేయ మని అభ్యర్థించడం, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల కోరిక మేరకు రక్త దానం శిబిరం ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షుడు సంగం వెంకట పుల్లయ్య, లగడపాటి రమేశ్ చంద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, జిల్లా కార్యదర్శులు రాజేష్, జుబ్బు, మొక్కల బాలు పాల్గొన్నారు. త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్, రైల్వే ఎస్ఐ అశోక్ రెడ్డి, డాక్టర్లు నాగరాజు, ప్రవీణ్, అఖిల్ తదితరులు శిబిరాన్ని సందర్శించారు. గ్రీన్ ఎర్త్ సొసైటీ చైర్మన్ రమేష్ రాథోడ్, కోనేరు పూర్ణ చందర్ రావు, కోనేరు సత్యనారాయణ, కార్పొరేటర్ రావి రాంబాబు, రామారావు, భరత్, నిరంజన్ రెడ్డి, రంగనాథ్, ఎస్కే గౌస్ బాషా, ఖలీల్, ప్రసన్న రాయపాటి, చిదిరాల కమల, ఆర్. రమేష్, శ్రీరామ్, ఆసిఫ్, సోయాబ్, అమన్, రఘు, షణ్ముఖ్, శుభాని బాయ్, ధనుష్, జయశ్రీ, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



## ఇకపై మండల కేంద్రంలోనూ ప్రజావాణి



**నూతనకల్,ఆగస్టు 16 (నినాదం):**

ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమంపై కార్యచరణ మొదలుపెట్టిందని ప్రజావాణి ఇక పై ప్రతి సోమవారం మండల స్థాయిలో 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తారని ఎంపీడీవో సునిత తెలిపారు.ప్రజల వినతులు, సమస్యలను నేరుగా అధికారులకు అందజేసే అవకాశం ఉందని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను ప్రజావాణి పోర్టల్ లో నమోదు చేసి,వాటిని సంబంధిత శాఖకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నామన్నారు.



## అటల్ బిహారీ వాజ్పేయి కి ఘన నివాళి అర్పించిన నేలకొండపల్లి బిజెపి యువ మోర్చా..

**నేలకొండపల్లి ఆగస్టు 16( నినాదం)**

నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ కార్యాలయంలో యువ మోర్చా ఆధ్వర్యంలో మాజీ ప్రధాని,భారత రత్న అటల్ బిహారీ వాజ్పేయి వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండల యువ మోర్చా ప్రధాన కార్యదర్శి జెల్లా సురేష్, బిజెపి పార్టీ మండల ఉపాధ్యక్షులు కొండా హర్ష వర్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కందరబోయిన వెంకటరమణ,సోషల్ మీడియా కన్వీనర్ కందరబోయిన గోపి మరియు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.యువ మోర్చా ప్రధాన కార్యదర్శి జెల్లా సురేష్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి,బిజెపి పార్టీ బలోపేతానికి అటల్ బిహారీ వాజ్ పై చేసిన సేవలు అజరామరమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## ఆడపడుచు వివాహానికి ఏజేఆర్ పెళ్లి కానుక

**వలిగొండ, ఆగస్టు 16 (నినాదం):**

మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన రాయగిరి శిరీష, వెంకటేష్ గౌడ్ దంపతుల కుమార్తె శ్రీజ వివాహ వేడుకలు ఆదివారం మండల కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవానికి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులకు 10 వేల నగదును పెళ్లి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఎలిమినేటి జంగారెడ్డి మాట్లాడుతూ ఆడపడుచుల వివాహాలకు తనవంతు సహాయ సహకారాలు అందించడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఏజేఆర్ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

## నేటి నుండి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి

**కమలాపూర్ ,ఆగస్టు 16 (నినాదం)**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుండి ప్రతి సోమవారము మండల ప్రజా పరిషత్తు కార్యాలయములో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి జి బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజావాణి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల వ్యవసాయ అధికారి, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి. సమగ్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారి, అంగన్ వాడీ సూపర్వైజర్ ,బీసీ సంక్షేమ విస్తరణ అధికారి, మండల గృహనిర్మాణ శాఖ అధికారి/ సహాయ ఇంజనీర్ ,మండల సహాయ ఇంజనీర్ (నీటిపారుదల శాఖ),మండల సహాయ ఇంజనీర్ విద్యుత్ శాఖ, అసిస్టంట్ ప్రాజెక్టు అధికారి ,తహసీల్దార్,ఉద్యానవన శాఖ అధికారి ,మండల విద్యాధికారి, మండల సాంఘిక సంక్షేమ అధికారి, మైనారిటీ సంక్షేమ అధికారి,మండల సహాయ ఇంజనీర్ (మిషన్ భగీరథ) (ఇంట్రా ఁ గ్రిడ్),సహాయ సందాలకులు /భూగర్భ జల వనరుల అధికారి, ముస్సి పల్ కమీషనర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ (పోలిస్), మండల పంచాయతి అధికారి, పశువైద్యాధికారి, వైద్యాధికారి సహాయ గిరిజన సంక్షేమ అధికారి, డిప్యూటీ తహసీల్దార్ ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ /సహాయ ఇంజనీర్ (ఆర్ అండ్ బి),అటవీ బీట్ అధికారి అటవీ రేంజ్ అధికారి,మండల సహాయ ఇంజనీర్ ( పంచాయతీ రాజ్),సర్కిల్ ఇన్స్పెక్టర్ (ఎక్సైజ్ ) శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

# 18న సీతారామ ప్రాజెక్టు పరిశీలన

- సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు నిధులు, చెరువుల అనుసంధానం పై వాస్తవాలు వెల్లడిస్తాం
- అబద్ధాలతో రైతులను మోసం చేస్తున్న మంత్రులు
- విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు




**కొత్తగూడెం, ఆగస్టు 16(నినాదం):**
సిపిఎం ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకత్వం ఆగస్టు 18న సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుల పర్యటన సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు.స్థానిక మంచికంటి భవన్ లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన తుమ్మల చెరువుకి సీతారామ కాలువకు ద్వారా 7.89 లక్షల ఎకరాలకు సాగునీరిస్తామని చెప్పిన మంత్రి తుమ్మల మాటలు మళ్ళీ అవాస్తవంగా మారాయన్నారు. మంత్రుల మాటలు నమ్మి నార్లు పోసిన రైతులకు నిరాశే మిగిలిందని విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేస్తూ మూడు జిల్లాల రైతులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరాటాలకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం సీతమ్మ సాగర్ బహుళ ప్రయోజనాల ప్రాజెక్టు ఊసే ఎత్తడం లేదన్నారు.ప్రాజెక్టే లేకుండా నీళ్ళు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 413 చెరువులకు సీతారామ ద్వారా సాగునీరు అందించవచ్చు కానీ ప్రభుత్వం ఆచరణలో విఫలమైందన్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో సమగ్రంగా సాగునీరు అందించే ప్రణాళిక ప్రభుత్వం ముందు పెడతామన్నారు.పాత డిపిఆర్ ప్రకారం కిన్నెరసాని,రోళ్లపాడు, బయ్యారం చెరువు కు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ అశ్వాపురం, బూర్గంపాడు, ములకలపల్లి, పాల్వంచ,అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు మండలాల రైతాంగం 18వ తేదీన జరిగే పర్యటనలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు, ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ,కె.బ్రహ్మచారి,లిక్కి బాలరాజు,రేపాకుల శ్రీనివాస్, పాల్గొన్నారు .

# ఎలాంటి ప్రాణహాని జరిగినా ఎమ్మెల్యే కూనంనేనిదే బాధ్యత

- ఎమ్మెల్యే బెదిరింపు ధోరణి సరికాదు...!?
- దళితుల సమాధుల మీద సౌదాన్ని నిర్మించుకున్న కూనంనేని
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



**కొత్తగూడెం, ఆగస్టు 16(నినాదం):**
కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధి కోసం నిర్వహించిన డిపిఆర్ టెండర్లలో అవినీతి జరిగిందని సాక్షాదారులతో సహా నిరూపించినందుకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బెదిరింపులకు దిగుతున్నాడని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ఆరోపించారు. ఆదివారం మండల పరిధిలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు డిపిఆర్ టెండర్ లో జరుగుతున్న అవినీతిపై తాను ప్రశ్నించినందుకు డిపిఆర్ టెండర్లు రద్దు అయ్యాయని స్పష్టం చేశారు. టెండర్ రద్దు కావడంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తనపై వ్యక్తిగతంగా దూషణలకు దిగుతూ తన స్థాయిని దిగజార్చుకున్నారని ఆరోపించారు. ఇకనుంచి వెంటబెడతామని, ఊరుకునేది లేదని పరోక్షంగా ఎమ్మెల్యే హత్యా రాజకీయాలను ప్రోత్సహించే అనుమానం కలుగుతోందని అన్నారు. ప్రజాక్షేత్రంలో అవినీతిపై ప్రశ్నిస్తే హత్యా రాజకీయాలు చేస్తామన్న విధంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడడం ఏ విధంగా సమంజసమో నియోజకవర్గ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.గతంలో సైతం తనకు వ్యతిరేకంగా మాట్లాడిన కొంతమందిపై సెవెన్ ఇంక్లైన్, ఎయిట్ ఇంక్లైన్, నైన్ ఇంక్లైన్ ఏరియాలలో హత్యలు చేయించినట్లుగా చెప్పుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. కేవలం అవినీతిపై ప్రశ్నిస్తే దాడులు చేస్తామని హత్యలు చేయిస్తామని బెదిరింపు ధోరణిలో మాట్లాడితే భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో అవినీతిపై ప్రశ్నించే హక్కు ప్రతీ ఒక్కరికి ఉంటుందని గుర్తు చేశారు. ఒకవేళ తనకు ఎలాంటి ప్రాణహాని జరిగినా అందుకు పూర్తి బాధ్యత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వహించాల్సి ఉంటుందని చెప్పారు.తాటాకు చప్పుళ్ళకు భయపడి పోరాటాలను మానుకొని ఉంటాం అనుకుంటే అది పొరపాటే అవుతుందని స్పష్టం చేశారు. కొత్తగూడెం నియోజకవర్గం లో జరిగే ప్రతీ అవినీతిపై ప్రజాక్షేత్రంలో రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమాలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లిజిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,భూక్యా శంకర్, సంపూర్ణాచారిలి తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పిన బైక్.. యువకుడి మృతి

**కాటారం, ఆగస్టు 16 (నినాదం):**
బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమలాపూర్ క్రాస్ సమీపంలోని 353(సీ) జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. కాటారం మండలం మద్దులపల్లికి చెందిన పొట్ల లక్ష్మణ్ రాజు (20) శుక్రవారం సాయంత్రం బంధువుల ఇంటికి వెళ్తున్నానని తల్లికి చెప్పి బైక్‌పై బయలుదేరాడు. అయితే తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆదివారం రహదారి పక్కన అడవిలో బైక్‌తో సహా లక్ష్మణ్ రాజు మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన కాటారం ఎస్సై శ్రీనివాస్ బైక్ అదుపుతప్పి చెట్టును



ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మృతుడి తల్లి మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు



నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



## నూతన విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

### విద్యుత్ అధికారులకు సన్మానం

**నేలకొండపల్లి ఆగస్టు 16(నినాదం)**
ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురం గ్రామ పరిధిలో విద్యుత్ అధికారులకు మంగాపురం తండా లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను గ్రామ సర్పంచ్ అశోక రాణి చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యుత్ వ్యవస్థలో నూతనంగా వచ్చినటువంటి యూనిఫామ్ సర్వీస్ లైన్స్ పద్ధతి ద్వారా నూతనంగా 11 కెవి మరియు 25 ఖవా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగినది, విద్యుత్ శాఖ వారిచే త్వరితగతిన పని పూర్తయినందుకు ధీరావత్ పుష్పావతి చాలా సంతోషాన్ని వ్యక్త పరచడం జరిగింది.ఇట్టి కార్యక్రమములో ఖమ్మం డివిజనల్ ఇంజనీర్ టి. వెంకటేశ్వర్లు మరియు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కూసుమంచి పి.వెంకట్, నేలకొండపల్లి మండల విద్యుత్ అధికారి జీ రవి,మంగాపురం తండా లైన్ ఇన్స్పెక్టర్ షేక్ దావూద్,లైన్ మెన్,నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇట్టి పనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు.ఈ సందర్భంగా వారిని సర్పంచ్ అశోక రాణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాంట్రాక్టర్ అశోక్ నాయక్, ఇతర సిబ్బంది కూడా ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదు విద్యుత్ డింఈ పవర్ కోటేశ్వరరావు, నేలకొండపల్లి మండల నాయకులు – చెరువు మాధవరం మత్స్య పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, పాటు ఇతర విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పవర్ కోటేశ్వర రావు మాట్లాడుతూ. విద్యుత్ శాఖ అందిస్తున్నటువంటి సర్వీసును ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడు, కొత్తగా విద్యుత్ కనెక్షన్ కావాలని అనుకునేవారు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు, నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూ షన్ కంపెనీ యాజమాన్యానికి విద్యుత్ వినియోగదారులు మరియు కొత్తగా కనెక్షన్ కావాలని కోరుకునే వారికి త్వరితగతిన స్పందించి వారి సర్వీస్లను మంజూరు చేస్తున్న విషయాన్ని కొనియాడుతూ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## భక్త రామదాసు సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం..

**నేలకొండపల్లి ఆగస్టు 16( నినాదం)**
నేలకొండపల్లి భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బుద్ధారం గ్రామంలో హరితహారం కార్యక్రమమును నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంను బుద్ధారం సర్పంచి మేళ్లచెరువు సత్యం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి హరితహారాన్ని ప్రారంభించారు. మల్లికార్జున మెడికల్ అధినేత ఓరుగంటి నారాయణరావు మామిడి మొక్కలని ఉచితంగా అందించారు.గ్రామ సభ్యులకు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పచ్చ తిరుపతయ్య సెక్రటరీ గెల్లా వెంకటరమణ గుప్తా కోశాధికారి దండా రవీంద్రబాబు హరితహారం చైర్మన్ ఓరుగంటి నారాయణరావు గెల్లా జగన్మోహన్రావు కొడారు ఎలమద్ది లెనిన్ ఏటుకూరి వెంకట రామారావు పొన్నగాని శ్రీనివాస్ కొడారు వెంకటాచారి నంచర్ల దేవి ప్రసాద్ షేక్ ఖాసిం సాహెబ్ కాకాని ధనమూర్తి ఆరికట్ల గురవయ్య ఆరికట్ల కొండలరావు. పాల్గొన్నారు.

## ఉద్యమకారులను విస్మరించిన ప్రభుత్వం

### టీ.జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఇజ్రాయిల్

**నేలకొండపల్లి ఆగస్టు 16( నినాదం)**
తెలంగాణ ఆత్మగౌరవం కోసం మరో పోరాటం కు సిద్ధం కావాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి జిల్లా చైర్మన్ మందడి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ఆదివారం నేలకొండపల్లి మండలం లోని పలు గ్రామాలలో పర్యటించారు. ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం నేలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది ఆత్మబలిదానాలు చేశారని పేర్కొన్నారు. కానీ నేడు వారి బలిదానాలకు విలువ లేకుండా పోతుందన్నారు.వారి ఆశించిన లక్ష్యం నేరవేరటం లేదన్నారు. అమర వీరుల త్యాగాల ను విస్మరించిందన్నారు. నిధులు, నియమాకాలు మరిచిపోయారన్నారు. మాట తప్పిన ప్రభుత్వం పై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టేందుకు కార్యచరణ ను రూపొందించనున్నట్లు తెలిపారు.తెలంగాణ ఆత్మగౌరవంను కాపాడుకునేందు కు మరో ఉద్యమం కు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. టీజేఏసీ ని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్యం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో టీజేఏసీ ని పటిష్టం చేసేందుకు తొలుత డివిజన్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే జిల్లా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ విలేకర్ల సమావేశంలో టీజేఏసీ నాయకులు గాదరి వెంకన్న,జీ.రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తీజ్ వేడుకలు ప్రారంభం

- సంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం పండుగ
- బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్...
- తీజ్ వేడుకల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్ సింగ్ నాయక్



**కొత్తగూడెం, ఆగస్టు 16( నినాదం):**
బంజారాల పండుగల్లో ఒకటైన తీజ్ వేడుకలను బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న వేడుకలను శనివారం రాత్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో మొదలుపెట్టారు. వేడుకల్లో భాగంగా బంజారా సాధువు మంగుత్తు సాధుతో పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. మొదటిరోజు వివాహం కాని బంజారా యువతులు బుట్టల్లో మట్టి నింపి, గోధుమలు, శనగలు పోసి (తీజ్ బోయేరో) పందిరి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బానోత్ వీరునాయక్ మాట్లాడుతూ బంజారాల ఆచారాలను పాటిస్తూ, సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూ వాటికి అనుగుణంగా తీజ్ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈనెల 23వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రగతి మైదానంలో జేఏసీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరిని ఈ వేడుకల్లో భాగస్వాములను చేయడమే తమ ఉద్దేశ్యమని అన్నారు. ఈ సందర్భంగా బంజారాల పాటలకు యువతీ యువకులు, చిన్నపిల్లలు, మహిళలు నృత్యాలు చేస్తూ సరదాగా గడిపారు. రెండవ రోజైన ఆదివారం సైతం వేడుకల్లో భాగంగా ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమాల్లో కొత్తగూడెం మార్కెట్ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్, గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షులు రమేష్ రాథోడ్, జేఏసీ జిల్లా నాయకులు ధరావత్ కాన్షీరామ్, గుగులోత్ శంకర్.బానోత్ రమేష్, గుగులోత్ చందర్, గుగులోత్ భద్రు,ధరవత్ కృష్ణ.గుగులోత్ వినోద్, జాటోత్ భరత్, హరి, బిక్కులాల్, జె.బి.బాలు, ధరావత్ సురేష్, రమేష్, కిషన్, జయరాం, ప్రశాంతినగర్ సర్పంచ్ అజ్మీరా లైలా, మాజీ సర్పంచ్ బానోత్ వశ్యా,జానికి.. ఆమని.మహిళా నాయకురాళ్లు, మాజీ ఎంపీటీసీ రుక్మిణి, ఘంసీ, రుక్మిణి,శేవెరీ సుజాత.లక్ష్మి. వరలక్ష్మి.మేఘన.ఇందు. శ్రావణి.తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు పరామర్శ

**కాటారం, ఆగస్టు 16( నినాదం):**
మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రైతు కట్టెకోళ్ల బాపు, అతడి కుమారుడు మనోజ్ 2 రోజుల క్రితం పొలం వద్ద మోటర్ ఆన్ చేయబోయి విద్యుదాఘాతంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి , మాజీ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి , డీసీసీ అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య, మంథని నియోజకవర్గ యూత్ అధ్యక్షులు చీమల సందీప్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశీ వర్ధన్ రావు, ఏఎంసీ డైరెక్టర్ పిల్లమరి రమేష్, గంగారం గ్రామ సర్పంచ్ బండం శోభారాణి రాంరెడ్డి, నాయకులు కొట్టే ప్రభాకర్, వార్డు సభ్యులు నరేష్, మంతెన వనజ-వసంత్, తదితరులు ఉన్నారు.



## ఉప్పలమ్మ పూజలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**వైరా, ఆగస్టు 16 (నినాదం ):**
వైరా మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వరరావు నివాసంలో ఆదివారం నిర్వహించిన ఉప్పలమ్మ పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మాజీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, ఖమ్మం పట్టణ మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లాల్ మహమ్మద్, సింగవరపు నరేష్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విమర్శలు కాదు.. అభివృద్ధి లెక్క చెప్పండి



**భీమదేవరపల్లి ఆగస్టు 16 (నినాదం):**
బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం మానుకుని, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనుల లెక్కను ప్రజలకు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పచ్చునూరి కరుణాకర్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు, మెడికల్ పీజీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్, ఇండస్ట్రియల్ పార్క్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఫోర్‌లేన్ రహదారి, నూతన రహదారులు, వంతెనలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. "విమర్శలకు కాదు.. అభివృద్ధికే కాంగ్రెస్ ప్రాధాన్యం. ఎవరు పనిచేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు" అని కరుణాకర్ అన్నారు.




## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ, ఆగస్టు 16 (నినాదం):**
మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. పట్టణ కేంద్రంలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనలు తనిఖీలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరిపై కేసులు నమోదు చేసి రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే 10 వేల వరకు జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.



## ప్రాణాపాయంలో ఉన్న యువకుడికి అండగా సండ్ర

**ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స..**

### ప్రత్యేక చొరవతో మెరుగుపడుతున్న శివ ఆరోగ్యం

**సత్తుపల్లి, ఆగస్టు 16 (నినాదం)**
తేలు కాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అండగా నిలిచి, మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామానికి చెందిన 25 ఏళ్ల గొల్లమందల శివ ఇటీవల ప్రమాదవశాత్తు తేలు కాటుకు గురయ్యాడు. తేలు కాటుకు గురైన వెంటనే శివను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం కొద్దిసేపటికే శివ రక్తపు వాంతులు చేసుకోవడంతో పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో ఖమ్మంలోని సంకల్ప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివ ఆరోగ్యం క్షీణించడంతో వైద్యులు పరిస్థితిని పరిశీలించి అత్యవసర వైద్యం అందించారు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దృష్టికి తీసుకొని వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ప్రత్యేక చొరవ తీసుకుని కేపీ అనే వ్యక్తిని ఆసుపత్రికి పంపించి వైద్యులతో సండ్ర మాట్లాడిం చారు. శివ ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు వైద్యులతో, కేపీతో మాట్లాడి సండ్ర పర్యవేక్షించారు. తీవ్ర ప్రాణాపాయ స్థితిలో ఉన్న శివకు ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రిలో అందిన సకాలపు వైద్యంతో ప్రస్తుతం ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సండ్ర వెంకట వీరయ్య ప్రత్యేక చొరవతోనే తమ కుమారుడికి మెరుగైన వైద్యం అందిందని శివ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఖమ్మంలోని ఆసుపత్రికి వెళ్లి శివను పరామర్శిం చారు. వైద్యులను కలిసి శివ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శివ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## నేడు మండలపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

**కాటారం, ఆగస్టు 16( నినాదం):**
ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి, ఎంపీడీవో బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని దరఖాస్తుదారులు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.



## గుంతలు పూడ్చిన ఎర్రగుంటపల్లె యువకులు

**కాటారం, ఆగస్టు 16( నినాదం):**
మండలంలోని ఎర్రగుంటపల్లెలో 'మన పల్లె.. మన కుటుంబం' నినాదంతో యువకులు సామాజిక బాధ్యత చాటుకున్నారు. గ్రామంలోని ప్రధాన అంతర్గత రహదారులపై గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన యువకులు స్వచ్ఛందంగా శ్రమదానం చేపట్టారు. ఇసుక, కంకర, సిమెంట్‌ను సమకూర్చుకుని రహదారులపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా తగ్గే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. ప్రజల సమస్యను గుర్తించి సొంతంగా ముందుకొచ్చి శ్రమదానం చేసిన యువకులను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు సభ్యుడు మానేం రాజబాబు, ఎర్రగుంటపల్లి యూత్ అధ్యక్షుడు ఇప్పలపల్లి దేవేందర్, ఉప్పు సంతోష్, పైడాకుల మహేందర్, మాచర్ల రాజనారాయణ, ఎండీ జమీర్ ఖాన్, గోనె సాయి, సాంబరాతి మనోహర్, గోనె వెంకటస్వామి, స్థానికులు పాల్గొన్నారు.



## అరులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ఇంటి నిర్మాణానికి 15 లక్షలు ఇవ్వాలి..

### సిపిఎం మండల నాయకులు బాణాల రాజన్న

**డోర్నకల్ /మరిపెడ, ఆగస్టు 16 (నినాదం)**
అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి ఇంటి నిర్మాణానికి 15 లక్షల రూపాయలు ఇవ్వాలని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని సిపిఎం మండల నాయకులు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆగస్టు 16 ఆదివారం రోజున మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో సిపిఎం శాఖ సమావేశం చేనెబోయిన ఎంకన్న అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో రాజన్న మాట్లాడుతూ రెండో విడత ఇంద్ర మైండ్లు అర్హులైన వారందరికీ కేటాయించాలని ఇంటి మెటీరియల్ ఖర్చులు బాగా పెరిగినందున ఇంటి నిర్మాణానికి 15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు గ్రామాల్లో సైడ్ కాలువలు లేక డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై దోమలు వల్ల టైఫాయిడ్ మలేరియా డెంగు తదితర జబ్బులు వస్తున్నాయని ప్రజలను కాపాడడానికి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు మహిళలకు 2500 రూ పెన్షన్ పెంపు రూ 4000 వికలాంగులకు 6000 చేనేత గీత ఒంటరి మహిళలు తదితరుల పెన్షన్లను పెంచి ఇవ్వాలని రేషన్ కార్డు పై 16 రకాల నిత్య సరుకులు ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో మండల నాయకులు తూము విజయ్ కుమార్చే,నేబోయిన వెంకన్న, ఉండ్రాచి సురేష్, పోలోజు సోమన్న, బోలు సాయి, సందు సోమన్న,ఎల్లె రాములు, బొజ్జమంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. యువకుడు మృతి

**అశ్వారావుపేట, ఆగస్టు 16(నినాదం)**



మండలం జమ్మిగూడెం వద్ద ఆదివారం రాత్రి బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.మృతుడిని మల్లం నాగరాజు (23)గా గుర్తించారు. ఇతను వెంకటేష్ కుమారుడు, కోయ కూలీ, అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం గ్రామానికి చెందినవాడు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు

**మహాదేవపూర్ ఆగస్టు 16, (నినాదం);**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కుదురుపల్లి వద్ద ఎక్స్ ప్రెస్ బస్ ఆగేలా చర్యలు తీసుకున్న ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబుకు గ్రామ సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి, కాళేశ్వర దేవస్థానం డైరెక్టర్ అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని మహిళలు వృద్ధులు కుదురుపల్లి వద్ద బస్సులు ఆపకపోవడంతో నాన్న ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయ డంతో స్పందించిన అధికారులు వెంటనే ఎక్స్ ప్రెస్ బస్సులు ఆగేలా చర్యలు తీసుకున్నారని దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వారు తెలిపారు.

## సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరిష ఏసు కన్నుమూత

**నాలుగు దశాబ్దాలుగా పార్టీకి సేవలు**

**కోదాడ, ఆగస్టు 16 (నినాదం):**



అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరిష ఏసు (60) అనారోగ్యంతో మృతి చెందారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ సేవలందించారు. 1981లో గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా, 2006లో ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవ చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని శాంతినగర్ కాంగ్రెస్ నాయకులు పేర్కొంటూ నివాళులర్పించారు.

## వ్యవసాయ బావిలో జారిపడి రైతు మృతి

**భీమదేవరపల్లి ఆగస్టు 16 (నినాదం):**



వ్యవసాయ బావి వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన గోపగోని వెంకటయ్య (63), తండ్రి పెద్ద మల్లయ్య, తన వ్యవసాయ భూమిలోని బావిలో క్రేన్ సాయంతో పూడిక మట్టి తొలగించే పనులు చేపట్టారు. శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో వెంకటయ్య తన ఇద్దరు కుమారులు, కూలీలతో కలిసి బావి వద్ద ఉన్నారు. ఈ క్రమంలో బావి అంచున ఉన్న విద్యుత్ స్టార్టర్ వైర్‌ను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయారు. వెంటనే కుమారులు, కూలీలు క్రేన్ సాయంతో ఆయనను బయటకు తీశారు. ప్రమాదంలో కుడికాలు తొంటిలో విరగడంతో పాటు ఛాతీ, కడుపు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆటోలో ముల్కనూ రులోని సుధాకర్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలిస్తుండగా రాత్రి 8.30 గంటల సమయంలో సాయినగర్ వద్ద ఆటోలోనే వెంకటయ్య మృతి చెందారు. మృతుడి భార్య గోపగోని భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావుకు

# అభిమానులు ఘన స్వాగతం..

- అన్నారుగూడెంలో గ్రామం లో అభిమానులు సందడి
- మూడు నెలల ఆమెరికా పర్యటన ముగించుకుని స్వగ్రామానికి చేరుకున్న దొడ్డ
- కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి ఆత్మీయ స్వాగతం పలికిన కార్యకర్తలు



**తల్లాడ, ఆగస్టు 16 (నినాదం)**

తల్లాడ మండల మాజీ ఎంపీపీ, ప్రజాభిమాన నాయకుడు దొడ్డ శ్రీనివాసరావు మూడు నెలల అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వగ్రామం అన్నారుగూడెంకు చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆయన స్వగ్రామానికి చేరుకున్న విషయం తెలుసుకున్న కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని ఘనంగా స్వాగతం పలికారు.



కార్యకర్తలు బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుంటూ తమ అభిమాన నాయకుడి రాకను ఆనందంగా జరుపుకున్నారు. యువత ఉత్సాహంగా పాల్గొని దొడ్డ శ్రీనివాసరావును ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ.. తమ అభిమాన నాయకుడి రాక తమలో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. ప్రజా సేవలో ఆయన మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అన్నారుగూడెం అభివృద్ధికి కృషి చేసిన నాయకుడిగా, ప్రజలకు అండగా నిలిచే వ్యక్తిగా దొడ్డ శ్రీనివాసరావుకు తమలో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు.

**మా జీవితాలకు దిశానిర్దేశం..**

గ్రామ అభివృద్ధికి దిక్సూచి మీరే" అంటూ కార్యకర్తలు నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్‌తో పాటు అన్నారుగూడెం, బాలపేట, గోపాలపేట, నరసింహారావుపేట గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మరణించిన కార్మికుడికి 25 లక్షల

# ఎక్స్గ్రేషియా చెల్లించాలి

- ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్

**కొత్తగూడెం, ఆగస్టు 16( నినాదం):**

కొత్తగూడెం కార్పొరేషన్ లో 23వ డివిజన్ పరిధిలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న చైత్రం అనే కార్మికుడికి బుధవారం నాడు కరెంటు షాక్ తగిలి ప్రమాదం ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడి ఈరోజు ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన జైత్రం కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుడి కుటుంబానికి తక్షణమే అంత్యక్రియలకు మట్టి ఖర్చుల నిమిత్తం 50 వేలు, 25 లక్షల ఎక్స్గ్రేషియా, ఇందిరమ్మ ఇళ్లు, ఒకరికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఏ రంగానికి సంబంధించిన కార్మికులు ఆ రంగ కార్మికులను కేటాయించి ఆ యొక్క పనిని మాత్రమే చేపించే విధంగా అధికారూలు కార్పొరేటర్లు, కార్పొరేషన్ మీటింగ్ లో నిర్ణయం చేయాలన్నారు . కార్పొరేట్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు అలా చేయకపోవడం ఫలితంగా ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వారన్నారు జైత్రం కుటుంబానికి జరిగిన అన్యాయం మరే కుటుంబానికి కూడా జరగకూడదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం, ఆగస్టు 16(నినాదం):**



ఆగస్ట్17వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి విజయోత్సవ వేడుకలు

**తొర్రూరు, ఆగస్టు 16 (నినాదం):**

లయన్స్ సేవా తరుణికి ప్రోత్సాహం గర్వకారణం అని క్లబ్ మాజీ అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవి రెడ్డి తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఉత్తమ క్లబ్ గా గుర్తింపు పొందిన తొర్రూరు లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి ప్రతినిధులు డివిజన్ కేంద్రంలోని స్వాగత్ గ్రాండ్ లో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. బెస్ట్ క్లబ్, ఔట్ స్టాండింగ్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్ మరికొన్ని అత్యుత్తమ అవార్డులు అందుకోవడం పట్ల క్లబ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి జన్మదినాలు పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకు న్నారు. క్లబ్ కార్యక్రమాలకు సహకరించిన ప్రతినిధులకు పసందైన విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి రెడ్డి మాట్లాడుతూ.. 2024--25 లో తన హయాంలో ఉత్తమ క్లబ్ గా గుర్తింపు పొందడం గర్వకారణమని తెలిపారు. స్థానికులు క్లబ్ ప్రతినిధుల సహకారంతోనే వందలాది కార్యక్రమాలు విజయ వంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. సేవా తరుణి ద్వారా మహిళల్లో చైతన్యం,ఐక్యత విస్తృతమైందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సేవా తరుణి కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్లు డాక్టర్ కుందూరు రాజేందర్ రెడ్డి, తమ్మెర లక్ష్మీ నరసింహారావు, మాజీ డిస్టిక్ జివెల్టి కోఆర్డినేటర్ డాక్టర్ వేలూరి శారద, రీజియన్ చైర్మన్ దామెర సరేష్, జోన్ చైర్ పర్సన్ వజినపల్లి దీప, సెక్రెటరీ కూన పద్మావతి, ట్రెజరర్ వేముల మంజుల, ప్రస్తుత ఆర్సీ డాక్టర్ ఎస్. నాగవాణి, జెడ్ సి లయన్ వి.శైలజ,పిజెడ్సి ఆర్. శ్రీదేవి, ప్రతినిధులు రజిత,వాణి,రేణుక రెడ్డి,నిత్య,ఉమా రెడ్డి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి

**ఎంపీడీవో దండ జితేందర్ రెడ్డి**

**వేములపల్లి, ఆగస్టు 16(నినాదం)**

వేములపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్థానిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారాన్ని అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు తమ సమస్యలు, వినతులపై అధికారులకు ఫిర్యాదులు అందజేసేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ప్రతివారం సోమవారం ఉదయం నుంచే అధికారులు అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దండ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. భూసంబంధిత, సంక్షేమ పథకాలు, పంచాయతీ రాజ్, తాగునీరు, విద్యుత్ వంటి వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు నేరుగా అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు పంపి నిర్ణీత సమయంలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లే పనిలేకుండా స్థానికంగానే తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

**భీమదేవరపల్లి , ఆగస్టు 16 (నినాదం):**

బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. బాలల హక్కులను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని, బడి మానేసిన పిల్లలను తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. బాలలతో ఎవరైనా పని చేయిస్తే 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఆగస్టు 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు అందించడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బైరి శ్రీనివాస్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, పూదరి రవీందర్‌గౌడ్, బుర్ర గంగయ్య, బుర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.